క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



విశేష అలంకరణలో రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపీత కూచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ పండితులు స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్చి ప్రారంభం



తూర్పులక్ష్మీపురంలో ప్రారంభించిన ఆర్చి

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం స్వాగతద్వారాన్ని (ఆర్చి) ప్రారంభించారు. గ్రామంలో దాతల ఆర్థిక సహాయంతో నిర్మించిన స్వాగత ద్వారాన్ని చినజీయర్ స్వామి శిష్యురాలు వాగు రోహిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైవ స్వరూపాలతో స్వాగత ద్వారం ఏర్పాటు చేయడం గ్రామానికి శుభసూచకమన్నారు. గ్రామానికి మంచి జరుగాలంటే దేవతల అనుగ్రహం ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కటకం కిరీటి, తూముగాతు గురయ్య తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శిగా మధు



మధుసూదనరావు

ఏలేశ్వరం: సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శిగా ఏలేశ్వరం పట్టణానికి చెందిన అలమండ మధుసూదనరావు (మధు)నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ నేషనల్ చైర్మన్ కంచర్ల సురేష్ నుంచి ఉత్తర్వులు అందినట్టు సోమవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మధుసూదనరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ



కత్తిపూడిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ కుమార్

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు విద్యుత్ ఏఈ బి.కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తిపూడి జంగాలమెట్టలో గ్రామానికి చెందిన మంచాల సత్యనారాయణ పొలంలో వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో రాగిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. దీనిపై అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిశోర బాలికల అభివృద్ధికి పాటుపడాలి

సామర్లకోట: కిశోర బాలికల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. పదో తరగతి పూర్తయిన వెంటనే వివాహాలు వద్దని, వారికి చదువు చెప్పించి ఉన్నత స్థాయి చేరడానికి ప్రోత్సహించాలని కోరారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన, బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై వేధింపులను అరికట్టడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలకు 18, బాలురకు 21 ఏళ్లు నిండాక మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు.

వలంటీర్ వ్యవస్థతో మెరుగైన సేవలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కిర్లంపూడి, జగ్గంపేటలో వలంటీర్లకు సత్కారం



కిర్లంపూడిలో వలంటీర్లను సత్కరిస్తున్న తోట నరసింహం



ప్రత్తిపాడులో వలంటీర్లను సత్కరిస్తున్న వరుపుల సుబ్బారావు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక దొరగారి గ్రౌండ్‌లో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, 423 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. అనంతరం వలంటీర్లకు తోట నరసింహం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు మరింత గుర్తింపు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు తోట బాబ్జీ, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, వేగి రామకృష్ణ, అడారి మహేష్, పాముల చంటి, కర్రి వెంకటరమణ మూర్తి, దాడి చినబుజ్జి, ఓలేటి రాజు, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టను పెంచడానికి కృషి చేయాలి

జగ్గంపేట: ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందించి ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచడానికి వలంటీర్లు కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని 182 మంది వలంటీర్లకు సేవారత్న, సేవ మిత్ర పురస్కారాలు అందజేశారు. వలంటీర్లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి వలంటీర్లపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, మర్రిపాక సర్పంచ్ జగతం ఆనందరావు, ఎంపీడీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు శ్లాఘనీయం

ప్రత్తిపాడు: ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్న వలంటీర్ల సేవలు శ్లాఘనీయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు కొనియాడారు. స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవారత్న, 504 మంది సేవామిత్ర పురస్కారాలకు ఎంపిక కాగా వారందరినీ వరుపుల సుబ్బారావు సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఉత్తమ సేవలతో ప్రజల ఆదరాభిమానాలు పొందాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ల నిబద్ధతే కారణమన్నారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, ఎంపీడీఓ ఎస్.డేవిడ్ రాజ్, ఈఓఆర్డీ కె.కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన సోమవారం వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. వలంటీర్లను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామ్మకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సూరంపాలెం మాజీ సర్పంచ్ కుంచే చినబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తోట నరసింహం

రాష్ట్రాభివృద్ధికి జగన్ మళ్లీ సీఎం కావాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- యర్రవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



యర్రవరంలో పర్యటిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని యర్రవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం సమకూర్చిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకూ న్యాయం జరిగిందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. మహిళలకు పథకాల ద్వారా లక్షలాది రూపాయిల లబ్ధి చేకూరిందన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేశారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, రామిశెట్టి వెంకటరమణ, దాసరి రమేష్, నీరుకొండ అర్జునరావు, బుద్దా గణేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



గోకవరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గోకవరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గోకవరం ఎస్సై కె.నాగరాజు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి జి.సత్తిబాబు, కసిరెడ్డి కాంతికుమారి, అధ్యాపకులు గరగ శ్రీనివాస్, సంధ్యారాణి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



గోకవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

గోకవరం: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం రైతులు ఆందోళన నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి, గంగంపాలెం, కామరాజుపేట, రంపయర్రంపాలెం గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని తమ పంట పొలాలకు నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. లైన్‌మెన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ పేద విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.అబ్బాయి, కె.వరలక్ష్మి, పలు ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు



కత్తిపూడిలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అన్నవరం పోలీసుల కథనం ప్రకారం... విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లుతున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఒక్కసారిగా బీపీ తగ్గడంతో హైవేపై కత్తిపూడి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 21 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు ప్రయాణికులకు షెల్టర్ ఏర్పాటు చేసి తక్షణ సహాయం అందించారు. స్వల్పగాయాలైన పలువురిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అన్నవరం ఎస్సై కిశోర్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు కోరారు. మండలంలోని కాట్రావులపల్లిలో ప్రజలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని గ్రామ పెద్దలకు సూచించారు. ఎన్నికలకు సంబంధించి కేసులు పెడితే వాటి నుంచి బయట పడటం కష్టమన్నారు. గ్రామంలో జూదాలు, సారా అమ్మకాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కిర్లంపూడి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని రాజుపాలెంలో సోమవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. మహిళల పట్ల ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వాహన దారులు రోడ్డు భద్రతా చట్టాలు, రికార్డుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో మాదక ద్రవ్యాలు, మత్తు పానియాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇన్‌చార్జి ఎస్సై రామలింగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ ఎవీ రమణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రారండోయ్.. తీర్థం చూద్దాం

- ముస్తాబైన రంపయర్రంపాలెంలో పాండవుల మెట్ట
- నేటి నుంచి ఐదు రోజుల పాటు తీర్థ మహోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



రంపయర్రంపాలెంలో తీర్థానికి ముస్తాబైన పాండవుల మెట్ట



కొండపై ఉన్న గుహ



గుహలో ఏర్పాటు చేసిన పాండవుల విగ్రహాలు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో పాండవుల మెట్ట ఐదు రోజుల పాటు జరిగే తీర్థానికి సుందరంగా ముస్తాబైంది. మంగళవారం నుంచి జరిగే ఈ తీర్థానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఏటా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది తీర్థ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తీర్థం సందర్భంగా పాండవుల మెట్టను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ తీర్థానికి జిల్లా నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. తీర్థంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

శతాబ్దాల చరిత్ర

రంపయర్రంపాలెంలో పాండవుల మెట్టకు శతాబ్దాల చరిత్ర ఉందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ మెట్టకు సంబంధించి రెండు భిన్నమైన కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కొన్ని వందల సంవత్సరాల క్రితం బౌద్ధ మతస్థులు ఈ కొండపై మూడు గుహలను ఏర్పాటు చేసి ద్రౌపతిదేవి, పాండవుల విగ్రహాలు పెట్టారని భక్తుల నమ్మకం. మరో కథనం ప్రకారం పాండవులు వనవాసం సమయంలో ఇక్కడ కొండపై గుహలు ఏర్పరుచుకొని నివాసం ఉన్నారు. కొండపై ద్రౌపతిదేవికి ప్రత్యేకంగా, పాండవులకు ప్రత్యేకంగా గుహలు సైతం ఉన్నాయి. భీముడు కూర్చున్న రాయి కూడా ఇక్కడ ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పాండవులకు రక్షణగా రాత్రి సమయంలో భీముడు ఈ రాయిపై కూర్చొని కాపలా ఉండేవాడని, భీముడు కూర్చోవడంతో ఈ రాయి బీటలు వారిందని చెబుతుంటారు. ఈ కొండపైకి 1936వ సంవత్సరంలో మెట్లు నిర్మించారు. 1950వ సంవత్సరంలో గ్రామానికి చెందిన రాజా మధుపేటి నరసింహాదేవ్ కొండపై ఉన్న గుహల్లో పాండవులు, ద్రౌపతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ ఏటా భీష్మ ఏకాదశి రోజున పాండవుల తీర్థం నిర్వహిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కిర్లంపూడి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రామలింగేశ్వరరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామానికి చెందిన మురుకుర్తి సూరిబాబు కుమారుడు మురుకుర్తి గణేష్(18) కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద రామిశెట్టి గోవిందరావు కూరగాయల దుకాణంలో పని చేస్తున్నాడు. చిల్లర కోసమని జాతీయ రహదారిపై ఇటు నుంచి అటు వైపు వెళుతుండగా జగ్గంపేట నుంచి ప్రత్తిపాడు వైపు వెళుతున్న గుర్తు తెలియని బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గణేష్‌ను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

తుని రూరల్: నియోజకవర్గంలోని 223 పోలింగ్ కేంద్రాలను మరోసారి తనిఖీ చేస్తున్నట్టు తుని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కేవీ రామలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే ర్యాంపుల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. అయినప్పటికీ మరోసారి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ర్యాంపులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక వసతులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే వరకూ కొత్త ఓట్లు నమోదు చేసుకోవచ్చన్నారు. డబుల్ ఎంట్రీలు, ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో పోలింగ్ స్టేషన్‌కు ఓటు మార్పు, తదితర అభ్యంతరాలు ఉంటే ఆయా ఓటర్లు రాతపూర్వకంగా తెలియజేయవచ్చని తెలిపారు. ఏకమొత్తంగా వచ్చే అభ్యంతరాలను అనుమతించమన్నారు. వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు.

జూనియర్ కాలేజీలుగా హైస్కూళ్ల అప్‌గ్రేడ్

తుని: నియోజకవర్గంలో రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటనందూరు, తొండంగి మండల కేంద్రాల్లో ఉన్న రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్థాయిని పెంచి కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలలు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మొదట దశలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలను అప్‌గ్రేడ్ చేయగా రెండో విడతలో కో-ఎడ్యుకేషన్ కాలేజీలుగా హైస్కూళ్ల స్థాయిని పెంచినట్టు వివరించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు అందుబాటులోకి వస్తాయన్నారు.

పెన్షనర్లకు వైద్య పరీక్షలు



డాక్టర్ హరికృష్ణను సత్కరిస్తున్న పెన్షనర్లు

తుని: స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మాధవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆర్కే ఎమర్జెన్సీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. డాక్టర్ అల్లు హరికృష్ణ 60 మంది పెన్షనర్లకు ఉచితంగా వైద్య పరీక్షలు మందులను అందజేశారు. వృద్ధాప్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ హరికృష్ణను అసోసియేషన్ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులు వీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్, కోశాధికారి జి.కృష్ణ, జోసెఫ్, అప్పలరాజు, అప్పలస్వామి, అమలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పారాయణ

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక అఖండ విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పారాయణ నిర్వహిస్తామన్నారు. రాత్రి ఏడు గంటలు స్వామివారి తిరుకల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు.